**ఉపసర్పంచ్, వార్డుసభ్యుల రాజీనామా** 2







**ప్రశాంతంగా నవోదయ పరీక్ష** 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## పోలింగ్ సెంటర్లను పరిశీలించిన డీఎస్పీ



**అక్షటుడే, గాంధారి:** స్థానిక సంస్థల ఎన్నికలు రెండో విడత ఆదివారం జరుగనున్న నేపథ్యంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు శనివారం గాంధారిలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్ సెంటర్లలో సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతి భద్రత భంగం వాటిల్లకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సీఐలు సంతోష్ కుమార్, ఆంజనేయులు, నరేశ్, సంతోష్, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.



## పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. రెండో విడతలో నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 8 మండలాల్లో 162 పంచాయతీలు, 1,114 వార్డు స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ క్రమంలో సీపీ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 59 సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. 31 ఎఫ్ఎస్టీ టీమ్స్, 6 ఎస్ఎస్టీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాలకు సంబంధించి ఇప్పటివరకు 4 కేసుల లో 166.33 లీటర్లు మద్యం సీజ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. దాని విలువ రూ.97,490 ఉంటుందన్నారు. 308 మందిని తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు. రెండో విడత ఎన్నికల కోసం 1,120 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఫలితాల అనంతరం అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించొద్దని ఆయన సూచించారు.



## మాజీ ఎంపీపీ కారు దహనం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మాజీ ఎంపీపీ పస్క నర్సయ్య కారును దుండగులు తగులబెట్టారు. ఈ ఘటన మచ్చర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మాజీ ఎంపీపీ తన స్విఫ్ట్ డిజైర్ కారును ఇంటి ఎదుట పార్క్ చేశాడు. రాత్రి సమయంలో దుండగులు నిప్పటించడంతో పూర్తిగా దగ్ధమైంది. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కక్షలతోనే కారుకు నిప్పు పెట్టి ఉండవచ్చని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. కాగా.. ఈ ఘటనపై ఆర్మూర్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఓటర్లకు వాయిస్ కాల్స్ బంద్..



**అక్షరటుడే, కామారెడ్డి:** గాంధారి మండల కేంద్రంలో వాయిస్ కాల్స్ అంశం ఓటర్లను గందరగోళానికి గురిచేసింది. దీంతో 'గాంధారిలో వాయిస్ కాల్స్ కలకలం..' శీర్షికతో 'అక్షరటుడే' కథనం ప్రచురించింది. మాజీ సర్పంచ్ భూమి కబ్జా చేశాడని, అనుమతుల పేరిట వసూళ్లు చేశారని వాయిస్ కాల్స్ రావడంతో గాంధారి ప్రజలు అయోమయానికి గురయ్యారు. ఇలాంటి కాల్స్ కూడా వస్తాయా అని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రజలు ఈ వాయిస్ కాల్స్ కారణంగా గందరగోళానికి గురువుతున్నారని పేర్కొంటూ 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం కావడంతో.. అప్పటి నుంచి ఆ కాల్స్ ప్రజలకు రావడం నిలిచిపోయింది. అయితే ఈ వాయిస్ కాల్స్ ఎవరు చేయించారు.. దీని వెనక ఉన్నదెవరు అనే విషయం సస్పెన్స్‌గా మారింది. దీనిపై అధికారులు విచారణ చేపడతారో లేదో వేచి చూడాలి.





**ఉమ్మడి జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆయా గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సౌకర్యాలతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రంతో ప్రచార పర్వం ముగియగా.. ఎవరు గెలుస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు/ఎల్లారెడ్డి**

# రేపే రెండో విడత

- **పంచాయతీ ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు**
- **నిజామాబాద్‌లో 158, కామారెడ్డిలో 153 సర్పంచ్ స్థానాలకు పోలింగ్**
- **భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు**
- **పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది**

నిజామాబాద్ డివిజన్‌లోని ఏడు, ఆర్మూర్ డివిజన్‌లోని ఒక్క మండలానికి రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, ఆర్మూర్, జక్రాన్‌పల్లి మండలాల్లో ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 196 గ్రామపంచాయతీలకు గాను.. ఇప్పటికే 38 గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 158 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 1,760 వార్డు స్థానాలకు 674 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన చోట్ల ఎన్నికలు నిర్వహించనున్నారు.

### పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది..

పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రిలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సిబ్బంది తరలింపునకు నిజామాబాద్‌లో 53 రూట్లలో వాహనాలను సైతం ఏర్పాటు చేశారు.

### ప్రలోభాలపై నిఘా

ఎన్నికలకు ఒకేరోజు ఉండడంతో గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఉండేలా తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే భారీగా మద్యాన్ని సీజ్ చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 34 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు



చేపట్టారు. కొన్ని మేజర్ పంచాయతీల్లో డబ్బు, మద్యం జోరుగా చేతులు మారే అవకాశం ఉంది. అలాగే ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### మధ్యాహ్నమే లెక్కింపు

ఎన్నికల అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. చిన్న గ్రామాల్లో



సాయంత్రంలోపు ఫలితం తేలనుంది. పెద్ద జీపీల్లో రాత్రి వరకు లెక్కింపు జరిగే అవకాశం ఉంది. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక అనంతరం ఉపసర్పంచ్‌ను సైతం ఎన్నుకుంటారు.

### కామారెడ్డి జిల్లాలో..

ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 153 సర్పంచ్, 873 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 197 జీపీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో ఇప్పటికే 44 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం అయ్యారు. 153 సర్పంచ్ స్థానాల కోసం 506 మంది అభ్యర్థులు బరిలో నిలవగా 873 వార్డు మెంబర్ స్థానాలకు 2,655 మంది పోటీ పడుతున్నారు. ఎన్నికల కోసం 873 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక పీవో, ఏపీవో చొప్పున అధికారులను నియమించారు.

### 19 కేంద్రాలపై ప్రత్యేకంగా నిఘా

కామారెడ్డి జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే 19 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా తగు చర్యలు చేపట్టారు. ఆ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు నియమించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏడు మండలాల పరిధిలో 800 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు.


– మరిన్ని చిత్రాలు 2వ పేజీలో..


## బీజేపీపై అభిమానంతోనే గెలిపించారు : దినేష్



**అక్షరటుడే, ఇందూరు :** పంచాయతీ ఎన్నికల్లో చాలా స్థానాల్లో బీజేపీపై ఉన్న అభిమానంతోనే ప్రజలు బీజేపీ మద్దతుదారులను గెలిపించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో 45 స్థానాల్లోనే బీజేపీ మద్దతుదారులు పోటీలో నిలిచారని దినేష్ కులాచారి పేర్కొన్నారు. బోధన్ డివిజన్‌లో 13స్థానాల్లో బీజేపీ మద్దతుదారులు విజయం సాధించారన్నారు. అలాగే మిగతా ప్రాంతాల్లోనూ కొన్నిఓట్ల తేడాతో తమ పార్టీ మద్దతుదారులు ఓడిపోయారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 20 సర్పంచ్ స్థానాల్లో మద్దతుదారులు పోటీ చేశారన్నారు. అందులో ఐదుగురు విజయం సాధించారన్నారు. బోధన్ డివిజన్‌కు సంబంధించి ఎడపల్లిలో సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టినప్పటికీ అక్కడ తక్కువ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించాన్నారు. రెంజల్, నీలా గ్రామాల్లోనూ సుదర్శన్‌రెడ్డి మార్క్ కనిపించలేదని వివరించారు. మోస్రాల్లో 12 వార్డు మెంబర్లకు గాను 11 మంది బీజేపీ మద్దతుదారులే విజయం సాధించారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణి రద్దు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వచ్చే సోమవారం జరగాల్సిన పోలీస్ ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని.. తిరిగి ప్రజావాణి నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.



## 'మెస్సీది సాకర్ గేమ్.. రేవంత్‌ది జోకర్ గేమ్..'

**అక్షరటుడే, ఇందూరు:** సాకర్ దిగ్గజం మెస్సీ, గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి మధ్య ఫుట్ బాల్ మ్యాచ్ తెలంగాణ ప్రతిష్టను దిగజార్చే ఒక బ్లేమ్‌గేమ్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల సంపదను దుర్వినియోగం చేస్తూ రాక్షసక్రీడ ఆడుతున్నారని విమర్శించారు. మెస్సీ ఆడేది సాకర్ గేమ్ రేవంత్ ఆడేది జోకర్ గేమ్ అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టులో ఓటుకు నోటు కేటుగాడు అని, రూ. కోట్లు కొల్లగొట్టేందుకే ఫుట్ బాల్ మ్యాచ్ తీసుకొచ్చాడని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను పక్కకు పెట్టి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడం సిగ్గుచేటని జీవన్‌రెడ్డి విమర్శించారు. ఒకవైపు గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే వాటిని పట్టించుకోకుండా హంగు ఆర్భాటాలకు వెళ్తున్నాడన్నారు. సింగరేణి సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంతానికి వాడుకోవడం సరికాదన్నారు. ఢిల్లీలో జరిగిన బీసీల ధర్నాకు రావడానికి తీరికలేని రాహుల్ గాంధీ ఫుట్ బాల్ మ్యాచ్ వీక్షించేందుకు స్పెషల్ ఫ్లైట్‌లో హైదరాబాద్ రావడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో సంక్షేమ తెలంగాణ దిశగా ఉండేదని కాంగ్రెస్ ఏడాది పాలనలో సంక్షోభ తెలంగాణగా మారిందన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలకు నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ మాజీ ఛైర్మన్ విఠల్ రావు, బీఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు నరేందర్, సీనియర్ నాయకులు ప్రభాకర్, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## వైభవంగా ఆరట్టు ఉత్సవం



**'స్వామియే శరణమయ్యప్ప' నామస్మరణతో ఇందూరు నగరం మార్మోగింది. అయ్యప్ప దేవాలయం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఖిల్లా వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర ఎన్టీఆర్ చౌరస్తా, పాత కలెక్టరేట్ చౌరస్తా, పోచమ్మ గల్లీ, గోల్ హనుమాన్, పెద్ద బజార్, గాజుల్ పేట్ మీదుగా రఘునాథ చెరువు వరకు కొనసాగింది. యాత్ర ఆద్యంతం దారి పొడవున రంగవల్లులు, ప్రసాద వితరణతో కోలాహలంగా మారింది. బొడ్డెమ్మ చెరువు వద్ద ఆలయ పూజారి శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆలయ ఛైర్మన్ భక్తవత్సలం, గుండయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

## గంజాయి తనిఖీల పేరుతో వృద్ధుడి వద్ద బంగారం అపహరణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మీవద్ద గంజాయి ఉందనే అనుమానాలున్నాయి.. తనిఖీలు చేయాలని పేర్కొంటూ వృద్ధుడిని దుండగులు దోచుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. మూడో టౌన్ ఎస్‌హెచ్‌వో హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాందేవ్‌వాడలో ఇద్దరు దుండగులు గంజాయి కోసం తనిఖీలు చేస్తున్నామంటూ హడావుడి చేశారు. ఈ క్రమంలో నాందేవ్‌వాడకు చెందిన రాములు అనే వృద్ధుడి బైక్‌ను ఆపారు. గంజాయి కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా ఆయనను నమ్మించి యాక్టీవా డిక్కీని తెరిపించారు. అందులో తనిఖీ నిర్వహించినట్లుగా నటించిన వారు.. ఏమీ లేకపోవడంతో ఎలాగైనా ఆయన వద్ద ఉన్న బంగారు గొలుసు ఉంగరాన్ని కాజేయాలని ప్లాన్ వేశారు. చైన్ స్నాచింగ్ ఘటనలు పెరిగిపోయాయని ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసి డిక్కీలో పెట్టుకోవాలని రాములుకు సూచించారు. వారి మాటలు నమ్మిన ఆయన మెడలోని తులం బంగారు గొలుసు, వేలికి ఉన్న అర తులం బంగారు ఉంగరాన్ని తీసి డిక్కీలో పెట్టేందుకు ప్రయత్నం చేశాడు. ఇంతలో తామే డీక్కీలో భద్రంగా పెడతామని అతని నమ్మించి బంగారు గొలుసుతో పాటు ఉంగరాన్ని కాజేసి అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే తేరుకున్న ఆయన డిక్కీలో చూడగా బంగారు గొలుసు, ఉంగరం కనిపించలేదు. దీంతో వెంటనే బాధితుతు మూడోటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు మూడోటౌన్ ఎస్సై హరిబాబు వెల్లడించారు.


## నవజాత శిశువును తగులబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

**అక్షరటుడే, బాన్సువాడ:** నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చెత్తకుప్పలో పడేశారు. ఈ సంఘటన బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని చెత్తకుండీ వద్ద కాలిన గాయాలతో ఉన్న శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. శిశువు పూర్తిగా కాలిపోయి ఉండడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎందుకు ఇలా చేశారని చర్చించుకుంటున్నారు. నవమాసాలు మోసి కన్న శిశువును ఇలా అమానుషంగా హతమార్చడంపై మహిళలు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎక్కడో కని హతమార్చిన అనంతరం గ్రామంలో తీసుకొచ్చి వేసినట్లు గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అమానవీయ ఘటనతో దేశాయిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న సీఐ తుల శ్రీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తామని పేర్కొన్నారు.

## వాలీబాల్ పోటీలకు మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థులు



**అక్షరటుడే, ఆర్మూర్:** సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఆర్మూర్ మండలం మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులు సంజుష (ఉమెన్స్ డిగ్రీ కాలేజ్) కీర్తి (జీజీ కాలేజ్) స్పందన (ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్) సాయిరాం (నిషిత డిగ్రీ కాలేజ్) అరవింద్, అజయ్ (జీ జీ కాలేజ్), నవీన బీటెక్ (మల్లారెడ్డి కాలేజ్, మేడ్చల్) ఎంపికైనట్లు పాఠశాల పీడీ మధుసూదన్ తెలిపారు. అమ్మాయిల జట్టు సౌత్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొంటుందని, అబ్బాయిలు చెన్నైలో జరుగుతున్న సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ పోటీలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరునగరి హరిత, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



## అయ్యప్ప భక్తులకు పండ్లు, నీళ్ల బాటిళ్లు అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఆరట్టు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు పండ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పోచమ్మ గల్లి వద్ద అయ్యప్ప ఆరట్టులో పాల్గొన్నారు. కార్యక్ర మాన్ని కాంగ్రెస్ నాయకులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు జావీద్ అక్రమ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినయ్, రాజేష్, ఆమరాజు, నాగరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# రేపే రెండో విడత



బ్యాలెట్ బాక్సును సరిచేసుకుంటున్న సిబ్బంది



ఎల్లారెడ్డిలో ఎన్నికల సామగ్రి పంపిణీలో అధికారులు



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ కేంద్రానికి తరలుతున్న సిబ్బంది

## పద్మశాలి కులస్థుల ఎన్నికల ప్రచారం



**అక్షరటుడే, ఆర్మూర్:** సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పద్మశాలి అభ్యర్థులకు మద్దతుగా ఆర్మూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఇట్టెం వనిత జీవన్, నందిపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి మానుపూరు భూమేశ్వర్లకు మద్దతుగా శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ త్రివేణి గంగాధర్, పద్మశాలి సంఘం నేతలు మోహన్ దాస్, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ ఆలయానికి యువకుల పాదయాత్ర



**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రం నుంచి యువకులు శనివారం పాదయాత్రగా వీరాంజనేయ ఆలయానికి వెళ్లారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బజరంగ్ గెలవడంతో ముందుగా అనుకున్న మొక్కు తీర్చుకునేందుకు యువకులు కోటగిరిలో ఆలయానికి పాదయాత్ర చేశారు. బజరంగ్ 799 మెజారిటీతో గెలిచినందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేరోళ్ల శంకర్, అశోక్, రాజు, బాలాజీ, అబ్బయ్య, దత్తు, రాజు, గంగాధర్, శివశంకర్, తదితరులు బయలుదేరి వెళ్లారు.

## ప్రశాంతంగా నవోదయ పరీక్ష



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్ఎస్, కేటీఎస్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు పాఠశాలల్లో కలిపి 294 మంది విద్యార్థులకు గాను 254 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ భీమ్‌గల్‌లో 144 మంది విద్యార్థులకు గాను 127 మంది హాజరయ్యారు. అలాగే కేటీఎస్ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు గాను 137 మంది హాజరయ్యారు.

## కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు: మాజీ ఎమ్మెల్యే



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ మోసగిస్తోందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా పెద్దకొడప్‌గల్ మండలంలో శనివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే పర్యటించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని వడ్లం, కాస్లాబాద్, బేగంపూర్‌లలో నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, నాయకులు సతీష్, సంజీవ్ పటేల్, బుసప్పా పటేల్, సుధీర్, నందు పాల్గొన్నారు.

## అన్ని జీవుల్లో సమానత్వాన్ని చూడగల జ్ఞాని సన్యాసి



**అక్షరటుడే, ఆర్మూర్:** అన్ని జీవుల్లో సమానత్వాన్ని చూడగల జ్ఞాని నిజమైన సన్యాసి అని ఆచార్య శ్రీధర నంద భారతి స్వామి అన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ వైదిక ధ్యానయోగా ఆశ్రమంలో శనివారం విశిష్ట గాయత్రి యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వక్త వేద పునీతానంద భారతి స్వామి భగవద్గీతలోని పంచమ అధ్యాయమైన కర్మ సన్యాస యోగంపై ప్రవచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## 15న ఆర్మూర్‌లో గోదావరి నది పరిక్రమణ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఈ నెల 15న గోదావరి నది పరిక్రమణ (ప్రదక్షిణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్మూర్ నవనాథ సిద్ధేశ్వర ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గోదావరి పరిక్రమణకు బృందావన్, అయోధ్య, చిత్రకూట్, ఓంకారేశ్వర్, ఉజ్జయిని, ద్వారక నుంచి 400 మంది సాధువులు, మహాత్ములు, పీఠాధిపతులు యోగులు, సత్పురుషులు పాల్గొంటారని పేర్కొన్నారు. వారంతా పెర్కిట్ నుంచి ఆర్మూర్‌కు పాదయాత్రగా చేరుకుంటారని వివరించారు. ఈనెల 16న నందిపేటలోని పలుగుట్టపై సత్సంగం, దర్శన మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని చిన్న దేవి సింగ్ తండా జీపీ పరిధిలోని రతన్ సింగ్ తండాలో శనివారం పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. రెండేళ్లుగా తండాలో కాంగ్రెస్ నాయకులు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. దీంతో తండావాసులు సమిష్టిగా నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. గతంలో మాజీ సర్పంచ్ భర్త తండాను అభివృద్ధి చేస్తామని మాటిచ్చి ఇప్పుడు మాట తప్పారన్నారు. రాబోయే రోజుల్లో తండాను అన్నివిధాలుగా అభివృద్ధి అయ్యేలా కృషిచేస్తామని.. బీఆర్ఎస్ మద్దతుదారుడిని గెలిపించేలా కృషి చేయాలని ఆయన తండావాసులను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్, వార్డు సభ్యుల రాజీనామా



**అక్షరటుడే, గాంధారి:** తమ తండాకు సర్పంచ్ పదవిలో వివక్ష చూపారని నిరసిస్తూ ఉపసర్పచ్, వార్డుల సభ్యులు రాజీనామా చేశారు. గాంధారి మండలం పంతులు నాయక్ తండాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తమ తండా సర్పంచ్ అభ్యర్థిని బెదిరించి నామినేషన్ విత్ డ్రా చేయించి ఆ పదవిని సోమ్లా నాయక్ తండాకు ఏకగ్రీవం చేసుకున్నారంటూ పంతులు నాయక్ తండావాసులు కలెక్టరేట్ లో ధర్నా చేశారు. ఈ మేరకు ఎన్నికల నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అయితే ఈ ఘటనపై గాంధారి తహశీల్దార్ రేణుక చవాన్ శనివారం మధ్యాహ్నం తండాకు వెళ్లి విచారణ చేపట్టారు. ముందుగా సోమ్లా నాయక్ తండాకు వెళ్లిన తహశీల్దార్.. తండా వాసులతో మాట్లాడారు. తాము ఎవరినీ బెదిరించలేదని, అందరి సమ్మతితో పాలకవర్గం ఏకగ్రీవమైందని వారు పేర్కొన్నారు. అనంతరం పంతులు నాయక్ తండాలో విచారణ చేపట్టగా సోమ్లా నాయక్ తండాలో తమకంటే ఓటర్లు ఎక్కువగా ఉన్నారని పేర్కొంటూ ఆ తండా వారికే సర్పంచ్ పదవి దక్కాలని దౌర్జన్యం చేస్తున్నారని తండావాసులు పేర్కొన్నారు.

### బెదిరించి ఏకగ్రీవం చేశారు..

తమ తండా నుంచి సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ లలిత గోప్య నామినేషన్ వేస్తే వారికి డబ్బులు పంపి ఒత్తిడి చేసి నామినేషన్ విత్ డ్రా చేయించారని ఆరోపించారు. అలాగే కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పడిన సమయంలో చేసుకున్న ఒప్పందంలో భాగంగా సోమ్లా నాయక్ తండాలో ఒకరు ఇప్పటికే సర్పంచ్ అయ్యారని.. ఈసారి తమ వంతు అయినప్పటికీ దౌర్జన్యం చేశారని వారు ఆరోపించారు. కాగా.. తమ తండాకు జరిగిన అన్యాయానికి నిరసనగా ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు బదావత్ టిక్యా, రమావత్ రమేష్, జాదవ్ రాణిలు పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తమ రాజీనామాను అధికారులు ఆమోదించాలని కోరారు. కాగా.. విచారణ జరిపిన తహశీల్దార్ రేణుక నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నారు.

## ఓటు వేయలేదని దాడి చేసిన పలువురి రిమాండ్




**అక్షరటుడే, బోధన్ :** పంచాయతీ ఎన్నికల్లో తమ అనుకూల అభ్యర్థికి ఓటు వేయలేదనే నెపంతో దాడి చేసిన నలుగురు వ్యక్తులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ శనివారం వివరాలు వెల్లడించారు. బోధన్ సర్కిల్ పరిధిలోని రెంజల్ మండలం వీరన్నగుట్ట గ్రామంలో గురువారం సర్పంచ్ ఎన్నికలకు పోలింగ్ జరిగింది. అయితే ఎన్నికలలో జమీలుద్దీన్, అప్సర్, హైమద్‌లు తమ సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయలేదనే కారణంతో ఇబ్రహీం, వాజీ, అవేష్, అబూబాకర్ కలిసి వారిపై దాడి చేశారు. దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం దాడిచేసిన ఆ నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నాలుగు మొబైళ్లు, రెండు కత్తులు, ఏడు కర్రలు, ఐరన్ రాడ్, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్సై చంద్రమోహన్ పాల్గొన్నారు.